విద్యార్థుల్లో మానసిక ఆందోళన తొలగించాలి

● అదనపు కలెక్టర్‌కు ఆప్ నేతల వినతి

అదనపు కలెక్టర్ వెంకటేర్డ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆప్ నాయకులు

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 22 : గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న విద్యార్థినుల వరుస ఆత్మహత్యలను నివారించేందుకు వారిలో నెలకొన్న మానసిక రుగ్మతలు, ఆందోళనలు తొలగించేలా నిపుణులచే అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజమల్లయ్య అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వెంకటేర్డ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. బాధిత కుటుంబాలకు నష్ట పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా హాస్టళ్లలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆప్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కెళ్లపల్లి శ్యామ్‌కుమార్, ఉపాధ్యక్షుడు తన్నీరు వెంకన్న, రింగు ఐసయ్య, జులూరి మమత పాల్గొన్నారు.

ఆప్ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా పరీక్షణ్‌రాజ్

ఆమ్ ఆద్మీ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా జిల్లా కేంద్రానికి చెందిన సూరారపు పరీక్షణ్‌రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షణ్‌రాజ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణంలోని 48 వార్డుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్, ఫిబ్రవరి 22 : ప్రభుత్వ ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు ఐక్యంగా ఉండి పెద్ద మొత్తంలో ఒకేసారి ఎరువులు కొనుగోలు చేయడానికి ఇలాంటి సంఘాలు ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉత్పత్తిదారుల సంఘం జిల్లా కో ఆర్డినేటర్ మద్దికుంట్ల శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుదాసుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమా మల్లారెడ్డి, నాయకులు తీగల గిరిధర్‌రెడ్డి, తీగల మల్లారెడ్డి, డైరెక్టర్లు చిత్లలూరి నారాయణ, దామోదర్‌నాయక్, సురిగి రామచంద్రు, ఏర్పుల వెంకన్న, బోల్క సైదులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

తిరుమలగిరి : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నరేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకుస్థాపన ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్య

రేపు కోదాడకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 22 : కోదాడ కోర్టు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన, సబ్ కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రారంభం శనివారం జరుగనున్నది. ప్రారంభోత్సవానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే పాటు హైకోర్టు న్యాయమూర్తులు నలుగురు కోదాడకు రానున్నారు. ఈ సందర్భంగా గురువారం కోదాడ బార్ అసోసియేషన్ నాయకులతో కలిసి అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్య శంకుస్థాపన, కోర్టుల ప్రారంభోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవబత్తిని నాగార్జున, ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాస్‌నాయుడు, సెక్రటరీ శరత్‌బాబు, జాయింట్ సెక్రటరీ సీతారామరాజు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్ తనిఖీ

వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్‌ను తనిఖీ చేస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 22 : రైతు వేదిక పెన్‌పహాడ్‌కు ప్రభుత్వం నుంచి వచ్చిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్‌ను జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఒక క్లస్టర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కోదాడ కాపుగల్లు, సూర్యాపేటకు పెన్‌పహాడ్, తుంగతుర్తికి వర్ధమానుకోట, హుజూర్‌నగర్‌కు పాలకవీడు, గుడుగుంట్లపాలెం క్లస్టర్‌కు ఈ వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్ మంజూరు అయినట్లు, ఈ నెల 24న ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇకపై రైతులకు నేరుగా ప్రభుత్వం, వ్యవసాయ శాస్త్రవేత్తల నుంచి సలహాలు, సూచనలు అందనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఓ బి.కృష్ణ సందీప్, ఏఈఓలు సంధ్య, మనోజ్, గోపి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

● ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 22 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఉపాధ్యక్షురాలు ఎస్.ఎల్.పద్మ అన్నారు. గురువారం స్థానిక పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఇఫ్టూ సూర్యాపేట జిల్లా ప్రథమ మహాసభలో వారు మాట్లాడారు. కార్మిక హక్కులను కాపాడాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు కొత్త బస్టాండ్ నుంచి పబ్లిక్ క్లబ్ వరకు కార్మికులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. కార్మికోద్యమంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాల ఇఫ్టూ జెండాను జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య ఎగురవేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. న్యాయవాది లింగంపల్లి భద్రయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి కసర్ల దుర్గయ్య, ఆటో యూనియన్ జిల్లా కన్వీనర్ వీరబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పేర్ల నాగయ్య, అరుణోదయ జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సన్న పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వ పతనం తప్పదు

● ఎస్‌కేఎం నాయకులు

హుజూర్‌నగర్‌లో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఎస్‌కేఎం నాయకులు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 22 : ప్రధాని మోదీ ప్రభుత్వానికి పతనం తప్పదని ఎస్‌కేఎం నాయకులు వంతుల కోటేశ్వర్‌రావు, యల్లావుల రాములు అన్నారు. శాంతియుత ఆందోళన చేస్తున్న రైతులపై హర్యానా పోలీసులు జరిపిన కాల్పులను నిరసిస్తూ గురువారం హుజూర్‌నగర్‌లోని మిర్యాలగూడ క్రాస్ రోడ్డులో రాస్తారోకో నిర్వహించి నల్ల కండువాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి ఢిల్లీ కేంద్రంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై భాష్పవాయువు ప్రయోగించి, రబ్బర్ బుల్లెట్లను ఉపయోగించి హర్యానా పోలీసులు మరణహోమం సృష్టించడం సరైంది. కాదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కంబాల శ్రీనివాస్, కొప్పొజు సూర్యనారాయణ, జడ శ్రీనివాస్, శీలం శ్రీను, గుండు వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బొడ్రాయిబజార్ : తాము పండించిన పంటలకు కనీసం మద్దతు ధర కావాలని పోరాడుతున్న రైతులపై ప్రధాని మోదీ ఆదేశాల మేరకు హర్యానా ప్రభుత్వం కాల్పులు జరిపి ముగ్గురు రైతుల మరణానికి కారణమైందని ఈ దారుణ హత్యాకాండని తీవ్రంగా ఖండించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, జిల్లా నాయకులు మల్లన్న, నర్సన్న, లక్ష్మన్న, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి రమేశ్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల : రైతులపై జరిపిన కాల్పుల్లో యువ రైతు శుభకరణ్‌సింగ్ మృతికి నిరసనగా సీపీఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ధనుంజయనాయుడు, శ్రీనివాస్‌రెడ్డి, సింహాద్రి, రావుల సత్యం, లక్ష్మి, చిలకరాజు శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

మోతె : హర్యానా పోలీసులను వెంటనే హత్యా నేరం కింద అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. ఢిల్లీ కేంద్రంగా సాగిన చారిత్రాత్మకమైన రైతాంగ పోరాటంలో మరణించిన 750 మంది రైతు కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు.

పనులు గుర్తిస్తేనే వలసలు నివారించవచ్చు

● పెన్‌పహాడ్ సోషల్ ఆడిట్‌లో ఎంపీపీ భిక్షం

సామాజిక తనిఖీ ప్రజా వేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షం

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 22 : ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో కలసి గ్రామాల్లో సంవత్సరానికి సంబంధించి పనులు గుర్తిస్తేనే కూలీల వలసలు నివారించవచ్చని ఎంపీపీ నెమ్మాది భిక్షం, జడ్పీటీసీ మామిడి అనితా అంజయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఈజీఎస్ 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజా వేదికలో వారు మాట్లాడారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తుండంతో ఈజీఎస్ సిబ్బందికి రూ.61,071 జరిమానా విధిస్తూ, రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసూధన్‌రాజు, అంబుడ్స్‌మెన్ లచ్చిరామయ్య, డీవీఓ అనసారి, ఏవీఓ అశారాణి, ఎంపీఓ నరేశ్, సూపరింటెండ్ శ్రీనివాస్, ఏపీఓ రవి, ఈసీ మహేశ్, ఎస్ఆర్పీ గోనే జీవన్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి : ఎంపీపీ రాణి

కోదాడ రూరల్ : అడ్లురూ సీసీ రోడ్డు శంకుస్థాపనలో ఎంపీపీ మల్లెల రాణి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 22 : ప్రజలు పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ మల్లెల రాణి అన్నారు. గురువారం మండల పరిధి అడ్లురూ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.13 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, మాజీ సర్పంచ్ తిరుపతయ్య, ఏఈ రాము, ప్రత్యేకాధికారి రవి, కార్యదర్శి కావ్య పాల్గొన్నారు.

విభలాపురంలో..

మోతె : మండలంలోని బీక్యాతండా, విభలాపురం గ్రామానికి మంజూరైనా సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఎంఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరైన రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మైనంపాటి గురువారెడ్డి, నాగిరెడ్డి, బానోతు భాస్కర్‌నాయక్, హలావత్ స్వామి, మంగ్యా పాల్గొన్నారు.

క్రీడాకారుడు బాలరాజుకు ఆర్థిక సాయం

క్రీడాకారుడు బాలరాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ గోపాల్

పాలకవీడు, ఫిబ్రవరి 22 : మండలంలోని జాన్‌పహాడ్ జడ్పీ హెచ్ఎస్‌లో చదువుతూ కబడ్డీ క్రీడలో రాణిస్తున్న కల్మటితండాకు చెందిన గిరిజన క్రీడాకారుడు రమావత్ బాలరాజుకు ఎంపీపీ భూక్యా గోపాల్ గురువారం రూ.15 వేల ఆర్థిక సాయం అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. బాలరాజు తెలంగాణ రాష్ట్రం తరుపున అంతర్జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంతో ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూక్యా నాగరాజు, శోభన్ రాములు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండలంలోని బిల్యానాయక్‌తండాకు చెందిన బానోతు సతీశ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి గురువారం యువకుడికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలంలో పేద ప్రజలకు, క్రీడాకారులకు, ఉన్నత విద్యలకు తనవంతు సహకారం అందిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 22 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. ఈ ఘటన కోదాడ పట్టణ శివారు కోమరబండ వై జంక్షన్ 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా గురుజాలకు చెందిన యాగంటి లక్ష్మి (55) తన భర్తతో కలిసి బైక్‌పై సూర్యాపేటలో బంధువుల ఇంటికి శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణమైంది. పట్టణ శివారు కోమరబండ వై జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను లారీ వెనుక నుంచి ఢీ కొట్టడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందగా భర్త తీవ్రంగా గాయపడ్డాడు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకవీడు, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ బానోతు నర్సింహనాయక్ గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధి గ్రామాలైన పాలకవీడు, గుడుగుంట్లపాలెం, యల్లాపురం, సజ్జాపురం, సజ్జాపురం తండా, నాగిరెడ్డిగూడెం, బొత్తలపాలెం, హనుమయ్యగూడెం, పాడ్యతండా, బెట్టెగూడెం గ్రామాల పరిధిలో నేడు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుమలగిరి, ఫిబ్రవరి 22 : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువును పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వేముల బాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జనరల్ విద్యార్థులు రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.125 ఫీజుగా చెల్లించాలని కోరారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో మార్చి 2 వరకు చేసుకోవచ్చని, ఏప్రిల్ 7న పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

సాగర్ నీటిని విడుదల చేయాలి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 22 : సాగు, తాగు నీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయాలని క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ నాయకుడు సుంకరి క్రాంతికుమార్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అన్నదాతలు పెద్ద ఎత్తున ఖర్చు చేసి వరి సాగు చేస్తున్నారని, పంటలను కాపాడడానికి నీటిని విడుదల చేసి నియోజకవర్గంలో చెరువులు, కుంటలను నింపాలని కోరారు.

ప్రతి విద్యార్థి లక్ష్య సాధనతో చదువాలి

● మోటివేటర్ పూర్ణ శశికాంత్

తుంగతుర్తి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోటివేటర్ పూర్ణ శశికాంత్

తుంగతుర్తి, ఫిబ్రవరి 22 : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితేనే విజయం సాధించగలరని మోటివేటర్ పూర్ణ శశికాంత్, ప్రిన్సిపాల్ వై.శ్యామలత అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ప్రగతిశీల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు పోలెపాక రామచంద్రు ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్‌పై గైడెన్స్ ఇచ్చారు. కార్యక్రమంలో పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య, వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, ఉపాధ్యాయులు బీవీ నాయక్, హసేన, నాగలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

నూతనకల్ : మండలంలోని వెంకేపల్లి జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తొనుకునూరి సైదులు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, సుదీర్‌రెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

తిరుమలగిరి, ఫిబ్రవరి 22 : అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొబైల్ హెల్త్ టీమ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు రక్తశాతం (హిమోగ్లోబిన్) పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి మందులు అందజేశారు. ఐరన్ పుష్కలంగా లభించే ఆకుకూరలు, పాలు, గుడ్లు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సరళ, ఫార్మసిస్ట్ వనజ, హెచ్ఎం దామెర శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ లక్ష్మీప్రసన్న

సమావేశంలో పాల్గొన్న ఆశ కార్యకర్తలు

నడిగూడెం, ఫిబ్రవరి 22 : వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ లక్ష్మీప్రసన్న అన్నారు. గురువారం మండలంలోని రామాపురంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కళావతి, సురేంద్ర, విజయ్, కృష్ణమూర్తి, మంజుల, శైలజ, శ్రీదేవి, కిరణ్, విజయ్‌కుమారి, రాధా, గీత, రమాదేవి, పద్మ, మంగ పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : ఇంటింటి జ్వర సర్వేను తప్పక నిర్వహించాలని హెల్త్ అసిస్టెంట్ యాతాకుల మధు అన్నారు. మండల పరిధి దొరకుంట ఆరోగ్య ఉప కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ.. మార్చి 3 నుంచి నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేసేందుకు ప్రతి ఆరోగ్య కార్యకర్త కృషి చేయాలని సూచించారు. అనంతరం ఇంటింటి జ్వరం సర్వే రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

చిలుకూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

చిలుకూరు, ఫిబ్రవరి 22 : కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశాల మేరకు చిలుకూరులోని జిల్లా పరిషత్ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రంను, రేషన్ షాపులను గురువారం మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్య శాఖాధికారి రూపేందర్‌సింగ్, తాసీల్దార్ ద్రువకుమార్, ఎంపీడీఓ గిరి బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి షరీపుద్దీన్ పాల్గొన్నారు.

జన సందోహంగా గాజులమల్కాపురం సమ్మక్క-సారలమ్మ జాతర

నాగదేవత వద్ద పూజలు చేస్తున్న మహిళలు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 22 : మండలంలోని గాజులమల్కాపురం సమ్మక్క-సారలమ్మ జాతర రెండోరోజు గురువారం భక్త జనంతో కిక్కిరిసింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు, నాయకులు విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు.

చీదెళ్లలో జ్యోతి నగర సంకీర్తన

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 22 : మండలంలోని చీదెళ్లలో శ్రీలక్ష్మి తిరుపతమ్మ-గోపయ్య స్వామి మాలధారుల ఆధ్వర్యంలో నిర్వహించిన జ్యోతి నగర సంకీర్తన కార్యక్రమం గురువారం కనువిందు చేసింది. దాతల సహకారంతో ఇటీవల నూతనంగా నిర్మించిన దేవాలయంలో శిఖర పోతురాజు, లక్ష్మి తిరుపమ్మ, గోపయ్య స్వాముల ఉత్సవ విగ్రహాలను పునఃప్రతిష్ఠ చేసి శ్రీచక్ర యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, జూలకంటి వెంకట్‌రెడ్డి, చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, రాజీవ్‌గాంధీ, గుర్రం అమృతారెడ్డి, మహింద్రారాజు పాల్గొన్నారు.

మోతె మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడిగా విక్రమ్

విక్రమ్

మోతె, ఫిబ్రవరి 22 : రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడిగా రాఘవాపురం డీలర్ కొరిపెల్లి విక్రమ్ గురువారం ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గుగులోతు సీతారాములు, కార్యదర్శిగా జేరిపోతల సంధ్యరాణి, జంపాల నరేశ్, కోశాధికారిగా కుంట నారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా కారంశెట్టి ప్రభాకర్, నవిలే రామకోటయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కొమ్మబండతండాలో బొడ్రాయి ప్రతిష్ఠ సందర్భంగా పూజలు చేస్తున్న గ్రామస్తులు

కొమ్మబండతండాలో బొడ్రాయి ప్రతిష్ఠ

చిలుకూరు, ఫిబ్రవరి 22 : మండలంలోని కొమ్మబండతండాలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమంను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు మేళ్లచెర్వు జాతరపై కలెక్టర్ సమీక్ష

మేళ్లచెరువు, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలో గల ప్రము